క్లుప్తంగా

తెలుగు ఉపాధ్యాయుడికి సౌత్ ఇండియా అవార్డు



రాజుపాలెం: మండల కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు బొల్లమాల ప్రసాద్‌కు సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు వచ్చినందుకు సోమవారం ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు పులిబండ్ల అశోక్, బొలమాల నాగమల్లేశ్వర రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ ఇన్నారెడ్డి, ఫాదర్స్ విజయ్ పీటర్, సాల్మాన్‌రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనర్సింహస్వామి సేవ



నకరికల్లు: స్థానిక కొండపై గల శ్రీలక్ష్మీ నర్సింహస్వామి సేవా కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా ఆచారంగా నిర్వహించే సేవ కార్యక్రమాన్ని ఆచారవంతులు స్థానిక కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభించారు. స్వామివారి నామస్మరణ కీర్తనలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆచారం చేస్తున్న భక్తులు ప్రత్యేక వస్త్రధారణతో సాంప్రదాయ నృత్యాలు చేశారు. కత్తితో సాధన, అగ్నిజ్వాలతో విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పురవీధుల గుండా సేవచేస్తున్న భక్తులు వెళ్తుండగా మహిళాభక్తులు అడుగడుగునా వార్లుపోసి మొక్కులు చెల్లించారు. పలువురు మహిళాభక్తులు పొంగలిపాత్రతో శ్రీకన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయం నుంచి కొండ వద్దకు నడుస్తూ వెళ్లారు. కొండవద్దకు చేరుకున్న భక్తులు విశేష అలంకరణలో ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రోసూరులో జోరుగా వర్షం



క్రోసూరు: క్రోసూరు మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురిసింది. దీంట్లో వర్షం నీళ్లు పంట పొలాల్లోకి, రోడ్ల మీదకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం ఏడు గంటలవరకు వర్షం కురిసింది. మండలంలోని విప్పర్ల వద్ద ఎగువన కురిసిన వర్షానికి చెక్ డ్యాంకు భారీగా నీళ్లు చేరుకున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం కురవటంతో రైతులు ఆనందాలు వ్యక్త పరుస్తున్నారు. ఇప్పుడే, ఇప్పుడే సాగుతున్న వ్యవసాయ పనులకు ప్రస్తుతం కురిసిన వర్షం జీవం పోసినట్లయిందని రైతులు తెలుపుతున్నారు.

ఉపాధిహామీ పనులపై నేడు ప్రజావేదిక

నకరికల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం పనుల సామాజిక తనిఖీలపై మంగళవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ అంశాలను చర్చించుకునేందుకు ప్రజావేదిక జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ పథకం వేతనదారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

బీఎల్ఓలతో సమావేశం

ముప్పాళ్ల: ఒకే ఇంటిపై పదికి పైగా ఓట్లు నమోదై ఉంటే వెంటనే వివరాలు అందివ్వాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన సర్వేలో గుర్తించిన అంశాలతో పాటుగా ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నట్లుగా గుర్తించినా, చనిపోయిన ఓటు జాబితాల నుంచి తొలగించకపోయిన వాటి వివరాలను వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అర్హులై ఉండి ఓటు హక్కు లేకుండా ఉన్న వారికి వెంటనే ఓటు హక్కు కల్పించేందుకు గాను దరఖాస్తు చేయించాలన్నారు. తుది ఓటర్ల జాబితాలను పంచాయతీ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీ ప్రసాదు, ఆయా గ్రామాల బీఎల్ఓలు పాల్గొన్నారు.

రేపు మండలస్థాయి గ్రీవెన్స్

వినుకొండ(నూజెండ్ల): స్థానిక నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మధుబాబు సోమవారం తెలిపారు. జిల్లాకలెక్టర్, జేసీ పర్యవేక్షణలో జరిగే ఈకార్య క్రమంలో ప్రజలు తమ సమస్యలు నేరుగా ఎంపీడీవో, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగించుకోవాలని తెలిపారు.

సంపూర్ణ పోషణకు భరోసా

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత పరిపుష్టిగా అమలు చేస్తున్నారు. ఓ మహిళ గర్భం దాల్చిన దగ్గర నుంచి ఆమె ప్రసవించి, బిడ్డ పెరిగి పెద్దవాడై పెద్ద చదువులు చదివి ఆ కుటుంబానికి చేదోడుగా ఉండేవరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోంది. పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది. అందులో ఒకటైన సంపూర్ణ పోషణ పథకాన్ని మరింత మెరుగుపరిచి వైఎస్సార్ కిట్లను ఇంటి వద్దకే పంపిణీ చేస్తోంది. దీంతో మహిళలు ముఖ్యమంత్రి జగనన్న మహిళా పక్షపాతి అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు (ఫైల్)

- ఇంటివద్దకే వైఎస్సార్ పోషణ కిట్లు
- కడుపులోని బిడ్డ నుంచి పండు ముసలి వరకు ఆరోగ్యానికి పెద్దపీట
- గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం
- సత్తెనపల్లి ఐసీడీఎస్ పరిధిలో లబ్ధి పొందుతున్న వారు 20,956 మంది

ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషణ వివరాలు ...

సరుకులు	పరిమాణం
బియ్యం	3కేజీలు
కందిపప్పు	1 కేజీ
వంటనూనె	500ఎమ్ఎల్
కోడిగుడ్లు	25
పాలు	5లీటర్లు
రాగిపిండి	2కేజీలు
అటుకులు	1కేజీ
బెల్లం	250 గ్రాములు
చిక్కి	250 గ్రాములు
కర్జూరం	250 గ్రాములు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ముఖద్వారమైన సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పటిష్టంగా అమలవుతోంది. గత ఆగస్టు నుంచి గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం వారి ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్నారు. దీంతో మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు మాత్రం అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోంది. సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. ప్రాజెక్టు పరిధిలో 303 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు 1,914 మంది, బాలింతలు 1,639 మంది, ఆరు నెలల నుంచి ఏడాది లోపు చిన్నారులు 1,902 మంది, ఏడాది నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 7,167 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 8,334 మంది అర్హులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ధ్యేయం

ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకాన్ని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. గర్భిణులకు రక్తహీనత కలగకుండా పోషకాహారం అందిస్తున్నాం. వీరి సంరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పథకాన్ని అమలు చేస్తోంది.

–టి.శ్రీలత, సీడీపీఓ, సత్తెనపల్లి

భక్తిశ్రద్ధలతో చాలీసా పారాయణం

వినుకొండ(నూజెండ్ల): విశ్వహిందూపరిషత్ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గుంటి ఆంజనేయస్వామి వారి ఆలయంలో లోక కల్యాణార్థం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పరిషత్‌ను 1964లో శ్రీకృష్ణాష్టమి రోజున స్థాపించారని, ముందుగా శ్రీకృష్ణ విగ్రహానికి, శ్రీ గుంటి ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సత్సంగాల వారు, భక్తులు పాల్గొని 108 మంది 21మార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్ పల్నాడు జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్, ఆలయ అర్చకులు ఆనందాచార్యులు, ఆలయ చైర్మన్ భవన్నారాయణ, పరిషత్ సమరసత అధ్యక్షులు గజవల్లి నాగపవన్, కొలిశెట్టి సుబ్బారావు, భద్రయ్య, గోనుగుంట్ల గంటారావు, నాగాచారి, భవనాసి సాంబశివరావు, కోట మల్లికార్జున, మహిళలు, భక్తులు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.



సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

ప్రారంభానికి సిద్ధమైన విశ్రాంతి భవనం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి వెళ్లే రహదారి మార్గంలో నూతనంగా రూ. 5 లక్షల వ్యయంతో ప్రయాణికులు విశ్రాంతి భవనం నిర్మాణ పనులు పూర్తి అయినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ నూతన ప్రయాణికుల కూర్చోనే విధంగా భవన నిర్మాణ పనులతో పాటు మంచినీటి సమస్య తలెత్తకుండా చేతి పంపు కూడా ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీపీ, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు సారథ్యంలో ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఏఈ చెప్పారు.



గణపయ్యకు రూ.60,925 హుండీ ఆదాయం

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయంలో సోమవారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ ఏడాది ఆగస్టు 4 నుండి సోమవారం వరకూ 37 రోజుల కాల వ్యవధిలో మొత్తం రూ.60,925లు హుండీ ఆదాయం సమకూరింది. ఈ నగదును దేవదాయ శాఖ ఖాతాలో జమ చేయనున్నట్లు ఈవో తులసీదాస్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మంజూష, స్థానిక పెద్దలు కోనేటి నాగయ్య, కె.రామకృష్ణ, సుబ్బారావు, ఎం.శివయ్య ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నాదెండ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు పురుగుమందు తాగి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు నాదెండ్ల చిన్న ఎస్సీ కాలనీకి చెందిన జంగా సుందరరావు (30) వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. కొద్దిరోజులుగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో ఈ నెల 7న పొలం వెళ్లి గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి బాధితుడిని 108 సాయంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. భార్య హారిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

కార్మికురాలు ఆత్మహత్య



యడ్లపాడు: జన్మభూమిలో ఉపాధి పనులు లేక ఒరిస్సా నుంచి వలస వచ్చిన ఓ కుటుంబానికి చెందిన బాలిక కడుపునొప్పి తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లా జాముని తాలూకాకు చెందిన పితంబర్‌దాస్, మామిదాస్ దంపతులు తమ నలుగురు సంతానంతో కొద్దికాలం కిందట ఉపాధి పనుల నిమిత్తం మండలానికి వలస వచ్చారు. పారిశ్రామిక వాడ బోయపాలెంలోని విశ్వతేజ నూలుమిల్లులో కార్మికులుగా చేరారు. భార్యభర్తలు తమ ముగ్గురు కుమారులు, కుమార్తెతో క్వార్టర్స్‌లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. కొద్దిరోజులుగా కుమార్తె అపరజిత్ దాస్ కడుపునొప్పితో బాధ పడుతుండగా కుటుంబ సభ్యులు గ్రామంలోని మెడికల్ షాపుల్లో మాత్రల్ని తెచ్చి ఇస్తున్నారు. నొప్పి తగ్గిన మరుసటి రోజు తమతో పాటు పనులకు తీసుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 9వ తేదీన కుమార్తె కడుపునొప్పి అనడంతో కూడా చిన్నకొడుకు సచిన్‌దాసును తోడుండి మిగిలిన వారంతా పనులకు వెళ్లారు. మధ్యాహ్నం తల్లి మామిదాస్ భోజనానికి వచ్చి తలుపు కొట్టగా ఇంట్లో ఉన్న కొడుకు పెద్దగా కేకలు వినిపించి, డోర్‌ను పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. హాల్లో కుమార్తె అపరజిత్ (15) తన చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. తోటి కార్మికుల సాయంతో కుమార్తెను కిందకు దించి కంపెనీ వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీంతో తీవ్రమైన కడుపునొప్పి తాళలేక తన బిడ్డ ఆత్మహత్య చేసుకుందని ఇచ్చిన తల్లి ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ ప్రత్తిపాటి సురేష్ కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి సోమవారం అప్పగించారు.

మిరప పొలాలను పరిశీలించిన అధికారి

రొంపిచర్ల: మండలంలో రైతులు సాగుచేస్తున్న మిరప పొలాలను ఉద్యానవన శాఖ అధికారి నవీన్ కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు మిరప మొక్కలను సాగు చేసే ముందుగా చివరి దుక్కిలో రైతులు అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎకరాకు 2 నుండి 3 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలన్నారు. ఇలా చేయటం వల్ల భాస్వరం మొక్కల వేర్లకు అంది వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. మొక్కల పైభాగంలో కూడా ఆకులు వచ్చి ఎదుగుదల బాగా ఉంటుందన్నారు. అలాగే ఎకరాకు 2 బస్తాల వేప పిండిని చివరి దుక్కిలో వేసి కలియదున్నటం వల్ల వేరు కుళ్లుడు, వేరు పురుగు బారి నుండి పంటను కాపాడుకోవచ్చు అన్నారు. మిర్చి పంట ఇప్పటికే 150 ఎకరాల్లో సాగు చేశారని, మరింత విస్తీర్ణంలో సాగు చేసేందుకు రైతులు అసక్తి చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా మిర్చి రైతులకు పంటలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి



సత్తెనపల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా పొన్నూరు రూరల్ నుంచి సత్తెనపల్లి టౌన్ సీఐగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన పి.ప్రభాకరరావు మర్యాదపూర్వకంగా ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిశంకరరెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజల రక్షణ, భద్రతకు కృషి చేయాలని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయండి

శావల్యాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. సోమ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గ్రామ సచివాలయాల వారీగా వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేసి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించాలన్నారు. సచివాలయాల వారీగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలు పారదర్శకంగా అందించటానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమం ఎంతో దోహద పడతుందన్నారు. ఈ సమావేశంలో మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, ఈవోపీఆర్డీ సుగుణ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

13న ఉపకరణాల స్క్రీనింగ్ క్యాంప్

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జాషువా కళా ప్రాంగణంలో కమిట్‌మెంట్స్ సంస్థ మరియు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకో మోటర్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్క్రీనింగ్ క్యాంప్ ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్థో లోపం ఉన్నవారు, పూర్తిగా చూపులేనివారు, వినికిడి లోపం ఉన్న వారికి పరికరాల సరఫరాపై పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9553749815, 9618210950 నంబర్లను సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్య చర్యలు నిర్వహించాలి

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీకం పోస్టు ఎరువు తయారు చేయాలని, గ్రామాల్లో సేకరించిన చెత్తను షెడ్స్‌కు తరలించాలని సూచించారు. స్పందనలో అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వివరాలు మండల పరిషత్‌కు అందజేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఈనెల 30 నుంచి అక్టోబర్ 12 వరకు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తహశీల్దార్, ఎంపీడీఓలు రెండు బృందాల ఆధ్వర్యంలో వెల్లటూరు, బొల్లాపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు, ప్రత్యేక వైద్య నిపుణులు బృందంలో ఉంటారని తెలిపారు. ఈనెల 15 నుంచి ప్రతి గ్రామంలో ఇంటింటా ఆరోగ్య వివరాలు డేటా సేకరించి నమోదు చేయడం జరుగుతుందని, అనంతరం ఆరోగ్య సురక్షలో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎంపిడిఓ తెలిపారు. పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలకు ఉపకరణాలు వితరణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో స్టార్ ల్యాబ్ నిర్వాహకుడు బాషా సహకారంలో వైద్యశాలకు అవసరమైన మజిల్స్ స్టిములేటర్, సీలింగ్ ఫ్యాన్‌లు సోమవారం అందించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఫిజియోథెరపీ విభాగం ఇప్పుడు ఎంతోమందికి సేవలు అందిస్తుందని, దానికి తోడు ఈ మజిల్స్ స్టిములేటర్ ద్వారా ఎంతోమందికి సేవచేసే అవకాశం వస్తుందన్నారు. ఇలాంటి వితరణలు ఇప్పించడం వల్ల పేద ప్రజలకు పరోక్షంగా సహాయం చేసినట్లే అవుతుందని కొత్త రామకృష్ణ సేవా తత్పరతను కొనియాడారు. ఫిజియోథెరపిస్ట్ కరుణాకర్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ విభాగం ద్వారా ప్రస్తుతం సుమారు 50 నుంచి 100 మందికి సేవలందిస్తున్నామని, ఈ స్టిములేటర్ మరి కొంతమంది పక్షవాతం రోగులకు వైద్యం అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ తాను అడగ్గానే స్పందించి వితరణ అందించిన స్టార్ ల్యాబ్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన బెడ్లకు ఫ్యాన్లు అవసరమని అడగ్గా తమ స్నేహితులు సహకారంతో ఫ్యాన్లు అందించామని వారికి కూడా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, స్టార్ ల్యాబ్ నిర్వాహకుడు షేక్ మొహుద్దీన్, మెడికల్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.



వైద్యశాలకు స్టిములేటర్, ఫ్యాన్లు అందిస్తున్న రామకృష్ణ

ప్రకృతి, అడవుల సంరక్షణే లక్ష్యం కావాలి

- కలెక్టర్ లోతేటి శివశంకర్
- పర్యావరణ వేత్త జాజి రాసిన పుస్తకం ఆవిష్కరణ

నరసరావుపేట: దేశంలో ఉన్న 33 శాతం అడవులు వృద్ధి చేసుకోవడం కోసం కారంపూడి గ్రామానికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) తలపెట్టిన కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ పిలుపు ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జాజి రాసిన ప్రకృతి ఆహారం అనే పుస్తకం, కరపత్రం ఆవిష్కరించి కలెక్టర్ మాట్లాడారు. జాజి తలపెట్టి విజయవంతం చేసిన కోటి విత్తన బంతులు కార్యక్రమం, పక్షుల కోసం వేస్తున్న పంట, ప్రకృతి ఔషధ మొక్కలు గురించి ఉన్న అపార అనుభవం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. మొక్కలు చెట్లపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. జాజి మాట్లాడుతూ జిల్లాలో అడవులు, నదులు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. అడవి చుట్టూ, పక్కన ఉన్న పొలాలలో ప్రకృతి వ్యవసాయంపై ప్రచారం చేసి, అడవి ప్రాణుల ఉనికిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ స్వచ్ఛందంగా వాడటం ఆపివేయాలని, చెట్లు నరకకుండా కాపాడుకోవాలని, ప్రకృతి, అడవి ప్రాణులు సంరక్షణ అందరి కర్తవ్యం కావాలన్నారు. సరికొత్త హరిత భారత్ కోసం ప్రతిఒక్కరూ కూడా ఈ ఉద్యమంలో పాలుపంచుకొని అడవులు, పచ్చని ప్రకృతి వృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్వో కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, తదితరులు

వినుకొండలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం

వినుకొండ టౌన్: జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక రేంజ్ కాంప్లెక్స్ నందు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్. రామచంద్రరావు హాజరై, అమర వీరుల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ రక్షణలో భాగంగా వారు చేసిన త్యాగాలను గుర్తుచేస్తూ, అటవీ రక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వినుకొండ రేంజ్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నగర వనం కొరకు ఎంపిక చేసిన బొల్లాపల్లి మండలం సరికొండపాలెం అటవీ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఆయన వెంట క్షేత్రాధికారి సయ్యద్ హుస్సేన్, రేంజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నగరవనం కోసం ఎంపిక చేసిన అటవీ ప్రాంతాన్ని సందర్శించిన డీఎఫ్ఓ ఎస్.రామచంద్రరావు

ఓటరు రీ–వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలో ఓటరు రీ–వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత బీఎల్‌వోలపైనే ఉందని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ అతిథి గృహంలో బీఎల్‌వోలకు ఓటర్ల రీ వెరిఫికేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. జీరో డోర్ నంబర్లు, ఒకే డోర్‌పై పదికంటే అధికంగా ఓట్లు, డబుల్ ఎంట్రీలను కనుగొని నమోదు చేసి నివేదిక అందజేయాలన్నారు.



బీఎల్‌వోలతో సమావేశంలో మున్సిపల్ కమిషనర్

నూతన కార్యవర్గ ఎంపిక

చిలకలూరిపేటటౌన్: గాస్పెల్ యూనేటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా గుమ్మడి కోటేశ్వర రావు, కార్యదర్శిగా జి రాజారత్నం, కోశాధికారిగా దేవిడ్‌రాజు ఎంపికయ్యారు. మొత్తం 12 మంది సభ్యులు కలిగిన ఈ నూతన కార్యవర్గం మూడు సంవత్సరాల పాటు కొనసాగనుంది. పాస్టర్లు నందమూరి క్రిస్టర్, మేడిద శ్యాముల్‌రాజు, ఎం సంసోను, ఎన్ అబ్రహం, ఎన్ థామస్, ఎంఎన్ మూర్తి, ఎ అబ్రహం, ఎ ఎలీషా తదితరులు పాల్గొన్నారు.



క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరికీ చేరవేయండి

మాచర్ల: ప్రతి పాస్టర్ క్రైస్తవ బోధనలను ప్రతి ఒక్కరికీ చేర్చి సమాజ సేవలో భాగస్వాములు కావాలని జిల్లా పాస్టర్ చైతన్య గెరా అన్నారు. సోమవారం పల్నాడు దైవ సేవకుల సహవాసం ఆధ్వర్యంలో పట్టణంలోని సుద్దగుంతల చర్చిలో ప్రసాద్ పాస్టర్, ఎ.జి.ఇమ్మాయిల్ ఆధ్వర్యంలో సేవకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సేవకులు లోకంలో అనవసరమైన విషయాలపై ఆలోచనలు మాని సేవపై దృష్టి పెట్టాలన్నారు. బైబిలులో ఉన్న పలు వ్యాఖ్యలు గురించి తెలిపారు. అనంతరం పల్నాడు దైవ సేవకులు కార్యవర్గానికి చెందిన వారు చైతన్యను వెస్లి, మోహన్, బ్రహ్మనాయుడు, ఎలియాజర్, యెహోషా తదితరులు సత్కరించారు.



ముఖ్య అతిథి జిల్లా పాస్టర్ చైతన్యను సత్కరిస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు